ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబర్ 2022
5
విజయనగరం

సతీష్‌కు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు

ప్రజాశక్తి -విజయనగరం కోట

విజయనగరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ పత్రి సతీష్ కుమార్‌కు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు (2020) ప్రకటించడం పట్ల ప్రముఖ మృదంగ విద్వాంసుడు, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి పేర్రాజు, మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి అభినందనలు తెలిపారు. అసోషియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ఉపాధ్యక్షులు దేవరాజు గోపాలకృష్ణ, దూసి శివరాంశర్మ, డాక్టర్ కెఎ పద్మప్రియ, చాగంటి కొండలరావు తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

రైతులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా, అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడతామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ ప్రక్రియలో ఎవరికి అప్పగించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కస్టోడియన్ ఆఫీసర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, రైతుల దగ్గర నుంచి ధాన్యం వచ్చిన తరువాత, దానిని రైస్ మిల్లు వద్ద భద్రంగా దింపించాల్సిన కీలక బాధ్యత కస్టోడియన్ అధికారులు నిర్వహించాలని చెప్పారు. ఈ ప్రక్రియను నిర్వహించాల్సిన యాప్ ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. మిల్లుకు ఇద్దరు చొప్పున మొత్తం 264 మంది కస్టోడియన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. శిక్షణకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, సిఎస్‌డిటిలు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఒక వసతి గృహం నడవాలంటే వార్డెన్, కుక్, కమాటి, స్వీపర్, నైట్ వాచ్ మెన్ ఉండాలి. కానీ పట్టణంలోని ఎస్‌సి వసతి గృహంలో మాత్రం సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో విద్యార్థులు, వార్డెన్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో వార్డెనే అన్ని తానై పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- ఎస్‌సి కళాశాల బాలుర వసతి గృహంలో సిబ్బంది కొరత
- పాడైపోయిన మరుగుదొడ్లు, బాత్ రూములు

బాలుర కళాశాల వసతిగృహం

అన్నీ తానై..

వసతిగృహంలో వంట చేస్తున్న వార్డెన్ అప్పారావు

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్ సెంటర్ సమీపంలో గల ఎస్‌సి బాలుర కళాశాల వసతి గృహంలో 73మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు వంట చేసేందుకు కుక్ ఉండాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నియమించలేదు. దీంతో వార్డెన్ అప్పారావు.. కుక్ అవతారమెత్తి వంటలు చేసి విద్యార్థులకు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కమాటి లేకపోవడంతో విద్యార్థులకు భోజనాలు కూడా వార్డెనే వడ్డించాల్సి వస్తోంది. స్వీపర్ లేకపోవడంతో ఒకసారి వార్డెన్, మరోసారి విద్యార్థులు స్వీపర్ అవతారమెత్తుతున్నారు.

బాలుర వసతి గృహానికి మహిళా వాచ్ ఉమెన్

బాలుర వసతి గృహానికి పురుష వాచ్‌మెన్‌ను నియమించాల్సి ఉన్నప్పటికి మహిళా వాచ్ మెన్‌ను నియమించారు. ఆమె విధులకు రాకుండా ఒక పురుషుడిని నియమించి విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు నెలకు రూ.7వేలు ఇవ్వగా వార్డెన్ రూ.3,500, మహిళా వాచ్ మెన్ రూ.3,500 ఇస్తున్నారు. ఆయన వాచ్ మెన్ విధులు నిర్వహించడంతో పాటు వంట, వడ్డించడం, తుడవడం వంటి పనులకు సాయం చేస్తుంటారు.

పాడైపోయిన గచ్చులు..

వసతి గృహంలో గచ్చులు, మరుగుదొడ్లు, బాత్ రూములు పూర్తిగా పాడైపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాడైపోయిన గచ్చులు, మరుగుదొడ్లు, బాత్ రూములు బాగు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అన్ని వసతిగహాల్లో ఇదే పరిస్థితి

జిల్లాలో ఉన్న అన్ని ఎస్‌సి బాలుర కళాశాల వసతి గృహాలు పరిస్థితి ఇలానే ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 17 ఎస్‌సి కళాశాల బాలుర వసతి గృహాలు ఉన్నాయి. ఆయా వసతి గృహాలలో సిబ్బంది కొరత వేధిస్తుంది. సమస్యలు కూడా పట్టి పీడించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో సరిపడా సిబ్బందిని నియమించాలని, మరుగుదొడ్లు బాగు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

యుటిఎఫ్ పాదయాత్రను ప్రారంభిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామ్మూర్తి

సిపిఎస్ రద్దు కోసం పాదయాత్ర

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శనివారం బొబ్బిలిలో యుటిఎఫ్ ఆధ్వర్యాన 2 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద పాదయాత్రను విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామ్మూర్తి ప్రారంభించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు హామీ ఇవ్వని రాజస్థాన్, ఛత్తీస్‌గడ్, పంజాబ్ వంటి రాష్ట్రాలు దానిని రద్దు చేసి, పాతపెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. కానీ రాష్ట్రంలో సిఎం జగన్ హామీఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఓట్లు వేయించుకునే వరకేలా హామీ ఉందని, ఇది మోసం చేయడమేనని అన్నారు. సిపిఎస్ కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. సిపిఎస్‌ను రద్దు చేసేవరకూ పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రారంభమైన పాదయాత్ర తహశీల్దార్ కార్యాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, బజారు సెంటరు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞను ఉపాధ్యాయులంతా చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శులు కేశవరావు, శంకరరావు, జిల్లా నాయకులు మధుసూదనరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

నేడు ఫైనల్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 6 వ రాష్ట్రస్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. శనివారం రెండో రోజు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడా అభివృద్ధికి అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ఫైనల్ పోటీలు జరగనున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ నాయకులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రెండో రోజు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్

జిల్లా ఎన్‌జిసి కోర్డినేటర్‌గా వేణుగోపాల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ గ్రీన్ కార్పొరేషన్ జిల్లా కో ఆర్డినేటర్‌గా కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బి.వేణుగోపాలరావు నియమితులయ్యారు. జిల్లా లోని పలు పాఠశాలల్లో ఎక్కువగా ఎకో క్లబ్‌లు స్థాపించడం, వాటి ద్వారా విద్యార్థులకు సహజ వనరుల పరరక్షణ గురించి అవగాహన కల్పించడంలో కృషి చేసిన ఆయనను కోఆర్డినేటర్‌గా నియమించారు.

చింతామణి వారసుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రముఖ జర్నలిస్టు సర్ సివై చింతామణి వారసులు సివై చింతామణి (84) శనివారం ఉదయం నగరంలోని ఆయన స్వగృహంలో మరణించారు. ఆయన మెహర్ బాబా కార్యక్రమాల్లో పాల్గొంటూ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా మనిషి సహజ సిద్ధమైన జీవితంలో జీవిస్తూ మూఢత్వాల మధ్యకు వెళ్లకూడదని ఎలుగెత్తి చాటిన మానవీయ మనిషి అని పలువురు కొనియాడారు.

సివై చింతామణి

గోనె సంచుల కొరత పాలకుల పుణ్యమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత కొన్నేళ్లగా ధాన్యం కొనుగోలు సీజన్‌లో గోనె సంచుల గోల ఎక్కువగా వినిపిస్తోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడక్కడ ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఉమ్మడి విజయనగరం జిల్లాలో 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికితోడు పారదర్శకత పేరుతో కొనుగోలు ప్రక్రియను మిల్లర్లతో సంబంధం లేకుండా చేసిన విషయం విధితమే. ఈనేపథ్యంలో మిల్లర్ల వద్దవున్న గోనె సంచులను అంత సులువుగా రైతులకు ఇచ్చే పరిస్థితి ఉండబోదు. ఒకవేళ ఇచ్చినా అవి ఏమూలకూ సరిపోని పరిస్థితి. ఈ నేపథ్యంలో గోనె సంచుల కొరతను ఎలా అధిగమించాలన్న దానిపై గత మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సుదీర్ఘమైన చర్చేసాగింది. గోనె సంచులు అందుబాటులో ఉంచకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ బొబ్బిలి ఎమ్మెల్యే మొసలి కన్నీరు కార్చారు. కానీ, ఆయన వైఖరి వల్ల ఏకంగా జ్యూట్ ఉత్పత్తులు చేసే పరిశ్రమ ఆయన ఇలాకాలో మూతపడిపోయిందన్న విషయాన్ని ప్రజలు గమనించలేరను కున్నారో ఏమో...! ఈ మాటకొస్తే జిల్లా గోనె సంచులు, వాటి తమయారీకి అవరమైన నూలుపోగులు తయారీకి పుట్టినిల్లు. ఇందుకు కారణం లేకపోలేదు.

ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు ఎంతో అనుకూలం. 1990నాటికి విజయనగరం జిల్లాలో 57వేల ఎకరాల్లో గోగు సాగయ్యేది. గోగు నారను జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ప్రభుత్వం కొనుగోలు చేసేది. ఇప్పటికీ రీజనల్ ఆఫీస్ విజయనగరంలో ఉంది. అప్పట్లో గోగు నార కొనుగోలుకు గ్యారెంటీ ఉండడంతో రైతులు విరివిరిగా సాగుచేసేవారు. దీంతో, మిల్లులు వేలాది మంది కార్మికులతో కళకళలాడేవి. అందువల్లే ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కువగా జ్యూట్‌మిల్లులు ఆవిర్భవించాయి. జనపనార, గోగు

(మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారయ్యేవి. దీంతో, గోనె సంచుల కోసం దక్షిణ భారతదేశమే విజయనగరం వైపు తొంగి చూసేది. పాలకుల విధానాల వల్ల జ్యూట్ మిల్లులు దివాలా తీశాయి. జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో పాలకులే ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో, జ్యూట్ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గింది. ముఖ్యంగా నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 5వేల ఎకరాల్లో సాగవుతున్నట్టు రికార్డుల్లో పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అంత కనిపించడం లేదని రైతు సంఘం అభిప్రాయపడుతోంది. ఫలితంగా జిల్లాలో తొమ్మిది జ్యూట్‌మిల్లులకు గాను ప్రస్తుతం బొబ్బిలి జ్యోతి, కొత్తవలసలో ఉమా జ్యూట్‌మిల్లు, నెల్లిమర్ల జూట్‌మిల్లు మాత్రమే నడుస్తున్నాయి. విజయనగరంలో రెండు, బొబ్బిలిలో రెండు, కొత్తవలసలో రెండు పరిశ్రమలు మూతపడ్డాయి. గోనె సంచుల తయారు చేసే నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు పదేళ్ల క్రితమే తిరోగమనంలోకి వెళ్లింది. సుమారు 5వేల మంది కార్మికులతో కళకళలాడేది. ప్రస్తుతం 1500 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సాలూరు జ్యూట్‌మిల్లు ఎప్పటికప్పుడు మూతపడుతోంది. జ్యూట్ మిల్లుల్లో ఒకప్పుడు 25వేల మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం 2500 నుంచి 3వేల మంది మాత్రమే ఉన్నారు. మూతపడ్డ వాటిలో మూడు పరిశ్రమలు (విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస శాశ్వతంగా మూతపడ్డాయి. ఇవన్నీ ఇప్పటికే రియల్ ఎస్టేట్‌గా మారాయి. కొత్తవలసలోని రెండు ఉమా జ్యూట్‌మిల్లులు కొన ఊపిరితో వున్నాయి. ఈనేపథ్యంలో ఒకప్పుడు జ్యూట్ మిల్లుల్లో పనిచేస్తూ దర్జాగా బతికే కార్మికులు ప్రస్తుతం సెక్యూరిటీగార్డులుగాను, వలస కూలీలగాను మారిపోయారు. గోగు సాగుచేసే రైతులు క్రమంగా ఇతర పంటలకు మళ్లడం, వాటికి కూడా మార్కెట్ సదుపాయం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇక గోనె సంచుల కొరత అక్కడి నుంచే ప్రారంభమైంది. దీన్ని అధిగమించేందుకు గోగు పంటలను ప్రోత్సహించేందుకు బదులు గోనె సంచుల గోలతో సరిపెడుతుండడం పట్ల జనం విస్తుపోతున్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ నగర మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని జిల్లా ఉపాధ్యక్షులు డి. రాము అన్నారు. విజయనగరం నగర మహాసభ శనివారం స్థానిక ఎస్‌విఆర్ డిగ్రీ కాలేజిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు, ఇంటర్ విద్యార్థులకు అమ్మఒడి పెండింగ్ పెట్టి, డిగ్రీ విద్యార్థులకు విద్యా దీవెన నిధులు ఆపివేసి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి ఉన్నాయని, ఆరు నెలల నుంచి బిల్లులు రిలీజ్ అవ్వక వార్డెన్లు విద్యార్థులకు సరైన భోజనాన్ని అందజేయలేకపోతున్నారని అన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. నగరంలోని జూనియర్ కాలేజీకి పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేకపోవడం అన్యాయమన్నారు. ఈ సమస్యలపై భవిష్యత్తులో పోరుబాట పడతామన్నారు. అనంతరం జరిగిన మహాసభలో 24 మందితో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె. రాజు, పి.రమేష్, పట్టణ గర్ల్స్ కన్వీనర్‌గా ఎస్.లావణ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దీప్తి, ఎర్రమ్మ, సంతోష్, మణికంఠ, పురుషోత్తం నాయుడు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎం సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు వేగవంతం

విజయనగరం : బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అమ్మఒడి లబ్ధి పొందుతున్న విద్యార్థులను గుర్తించి అర్హులైన వారందరిని ఓటర్లుగా నమోదు చేయాలని సచివాలయాల సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన వారందరికీ ఒకే చోట ఓటు ఉండేలా చూడాలని సూచించారు. అయ్యన్నపేట , 41 వ వార్డు సచివాలయం అంబేద్కర్ కాలనీ, దుప్పాడ సచివాలయాలను శనివారం కలెక్టర్ సందర్శించారు. సచివాలయంలో నున్న బిఎల్ఒలతో మాట్లాడి ఎంత జనాభా ఉంది, ఎంత మంది ఓటర్లు ఉన్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఇంకా మిగిలిన వారెందరు, ఆధార్ సీడింగ్ ప్రక్రియ ఎలా జరుగుతోంది అనే అంశాల పై ఆరా తీసారు. బదిలీ అయిన వారిని, మరణించిన వారిని, డూప్లికేషన్లను తొలగించాలని, ఖచితమైన ఓటర్ల జాబితాను తయారు చేయాలని సూచించారు. వీటన్నిటికీ సంబంధించిన రికార్డు లను ఖచితంగా నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో స్పాట్ ఫీడింగ్ అవుతోందా లేదా అని ప్రశ్నించారు. గర్భిణులు, పిల్లలు కేంద్రాల్లోనే తినాలని ఎఎన్ఎం లకు సూచించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, తహశీల్దార్ బంగార్రాజు, ఎన్నికల డిటి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకోవాలి

కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

రాజ్యాంగ పీఠిక లో పొందుపరిచిన అంశాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి అన్నారు. మన దేశాన్ని గణతంత్ర ప్రజాస్వామ్యంగా తీర్చి దిద్దుకున్న రోజుగా జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన నవంబర్ 26 సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియం లో శనివారం రాజ్యాంగ ప్రస్తావన ప్రతిజ్ఞను కలెక్టర్ చదవగా అధికారులంతా ఆమెతో పాటు చదివి ప్రతిజ్ఞ చేసారు. రాజ్యంగా ప్రస్తావన చదవడం ద్వారా మన రాజ్యాంగ గొప్పతనాన్ని మనం అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమం లో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర రావు, సర్వే ఎడి త్రివిక్రమ రావు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

విజయనగరం టౌన్ : జిల్లాపోలీసు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి అదనపు ఎస్‌పి (ఆర్మ్ రిజర్వు) ఎం.ఎం. సోల్మన్‌పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి, ఎల్.మోహనరావు, డిపిఒ ఎఒ వెంకటరమణ పాల్గొన్నారు.

వైసిపిఆధ్వర్యంలో.. వైసిపి ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్.వి. వి రాజేష్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు. కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయనగరం కోట : ఎంఆర్ లా కళాశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్‌వి లక్ష్మి కుమారి మాట్లాడారు. సెట్విజ్ సిఇఒ బి. రామానందం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.అభినవ్ దీప్ దొర, వి.శ్రీనివాస్ చౌదరి, సహాయ మేనేజరు ఎ. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిదా నారాయణరావు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కొత్తవలస : కొత్తవలస తహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంబా రవిబాబు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎల్.కోట, వేపాడ ఎంపిపిలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపిపిలు కర్రి శ్రీనివాసరావు, అడపా ఈశ్వరరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, లెంక రామన్న పాత్రుడు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, గొరపల్లి రవి పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ప్రభుత్వ వైద్యులు జి.శశిభూషణరావు, అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు ఎస్.సాంబయ్య వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కౌన్సిలర్లు, నాయకులు రాజ్యాంగంపై దాడికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి తహశీల్దార్ ఆర్.మురళీకృష్ణ, ప్రత్యేక అధికారి బి.శాంతకుమారి, డిటి చిన్నారావు నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కునుకు త్రినాథరావు, గొంగాడ త్రినాథరావు, శారద, రమేష్, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని దేవిగుడి జంక్షన్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకట లక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిటిసి బి.ఆదిలక్ష్మి, మాజీ సర్పంచులు కె.వెంకటరావు, పోతయ్య, దుల్ల రమణ, నాయకులు మోపాడ శ్రీను, గంగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

గుర్ల : మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు.. అంబేద్కర్ ఫోటోకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎఐఎం జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వంగర: స్థానిక ఆర్‌సిఎం పాఠశాలలో ఎంఇఒ దుర్గారావు, ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు.

నెల్లిమర్ల : స్థానిక నగర పంచాయతి కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి కమిషనరు పి. బాలాజీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డెంకాడ: మండలంలోని గొలగాంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బడ్డకొండ అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి వాసుదేవరావు, పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తమ్మునాయుడు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఆదినారాయణ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేశారు. పినతాడివాడ హైస్కూల్‌లో మహిళా విభాగం సమతా జిల్లా కన్వీనర్ జి. నిర్మలా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైస్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ లక్ష్మి, కృష్ణవేణి, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

మెరక ముడిదాం: గర్బాం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ ఆధ్వర్యంలో విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. బైరిపురం ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆర్ లచ్చుమునాయుడు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నెల్లిమర్ల: బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ప్రాజెక్ట్స్, విషయ సంబంధిత మోడల్స్‌తో ఎగ్జి

పన్నుల వసూళ్లు వేగవంతం

మున్సిపల్ ఆర్‌డి జి.నాగరాజు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆస్తిపన్ను, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు.. అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం పన్ను వసూలు, చెత్త సేకరణపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 31లోగా 90శాతం, మార్చి నెలాఖరికి శత శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నుల వసూళ్లపై మున్సిపాలిటీ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పారిశుధ్య విభాగం ఉద్యోగులపై ఉందన్నారు. పన్నుల వసూలు, చెత్త సేకరణపై ఆర్‌డికి కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు వివరించారు. సమావేశంలోమున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, ఆర్‌ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి రూ.10 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలసకు చెందిన మహంతి రామునాయుడుకి ఊపిరితిత్తులు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 10 లక్షలు మంజూరైందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బాధితుడుకు శనివారం ఎమ్మెల్యే స్వగృహం మోపాడలో రూ. 10 లక్షలకు సంబందించి ఎల్‌ఓసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ముఖ్యమంత్రిని మనమంతా కాపాడుకోవాలన్నారు. మీ సమస్య నాకు చెప్పగానే నేను సిఎం జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడితే వెంటనే ఆపరేషన్ నిమిత్తం సహాయం చేసారన్నారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు మహంతి శ్రీనువాసరావు, ఎంకె మోహన్, రమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి- రేగిడి

స్త్రీనిధి రుణాలతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తారని క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల వారీగా మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రాజెక్ట్ పనులపై అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. ఏసీతో పాటు ఏపీఎం మంగమ్మ ఉన్నారు.

మెరకముడిదాం: స్త్రీనిధి ద్వారా అప్పులు తీసుకున్నటువంటి సభ్యులు ప్రతినెలా తప్పనిసరిగా బ్యాంకు ద్వారా కట్టాలని లేనిచో చర్యలు తీసుకుంటామని ఎపిఒ కెల్ల ఉమా మహేష్ హెచ్చరించారు. శనివారం ఆయన తమ సిబ్బందితో కలసి మండలంలోని మెరక ముడిదాం, బైరిపురం గ్రామంలలో రికవరీ కోసం తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి సక్రమంగా కట్టిన వారికి మరల ఆయా సంఘాలు ద్వారా అప్పు పొంద వచ్చునని చెప్పారు.

విద్యార్థుల సృజనాత్మకతకు శిక్షణ దోహదం

ప్రజాశక్తి- రేగిడి

విద్యార్థుల సృజనాత్మకతకు శిక్షణలు దోహదపడతాయని ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిరాజు అన్నారు. మండలంలోని ఉంగరాడ మెట్టలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రేగిడి, సంతకవిటి ఉపాధ్యాయులకు లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపి) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కనీస పరిజ్ఞానం పెంపొందించడానికి ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే మెలకులతో కూడిన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు

టిడిపి మండల విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక టిడిపి మండల కార్యాలయంలో శనివారం మాజీమంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు ఆధ్వర్యంలో టిడిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పతివాడ మాట్లాడుతూ రాక్షస పాలనను అంతమొందించి, రాష్ట్రాన్ని కాపాడుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఆ దిశగా టిడిపి కుటుంబసభ్యులంతా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, టిడిపి నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్‌రావు, పతివాడ అప్పలనాయుడు, పతివాడ తమ్మినాయుడు, కలిదిండి పాణీరాజు, కొర్నానా ఆదిబాబు, చిల్ల పద్మ, పడాల చిన్నారావు, ముని పైడయ్య, పిళ్ళా ముసలినాయుడు, బంటుపల్లి సురేష్, కూర్మారావు, కలిదిండి రంగరాజు, బంటుపల్లి విజయ్ కుమార్, పిన్నింటి రమేష్ నాయుడు, చీకటి సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సత్యంనాయుడుకు ఘన నివాళి

వేపాడ : మండలంలోని ఎన్‌కెఆర్‌పురంలో వైసిపి సీనియర్ నాయకులు మూకల సత్యంనాయుడు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణరాజు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎంపిపిలు దొగ్గ సత్యవంతుడు, గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, సేనాపతి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు ముమ్ములూరు జగన్నాథం, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరావు, తదితరులు నివాళులర్పించారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి

వేపాడ : మండల కేంద్రం వేపాడలో అంగన్వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. పిల్లలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందజేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కామేశ్వరి, అంగన్వాడీ కార్యకర్త మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వేపాడ : స్థానిక వైకెపి కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై విఒఎలకు అవగాహన కల్పించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సొంత పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

వేపాడ : స్థానిక ఎంఆర్‌సిలో శనివారం రెండో విడత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఇఒ శ్రీదేవి మాట్లాడుతూ అభ్యసన సామర్థ్యం పెంపుదలపై సూచనలు చేశారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం

పూజలు చేస్తున్న గొంప వెంకటరావు దంపతులు

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకట్రావు ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు భారీ ఎత్తున ఏర్పాటుచేశారు. రేలారే రేలా, బాలనాగమ్మ బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్, తెలంగాణ మహిళా బృందం కోలాటం చూపరులను ఆకట్టుకున్నాయి. భారీ బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఉత్సవ విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, కోళ్ల రాంప్రసాద్ దంపతులు, ఎస్‌టి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాసరి లక్ష్మి, తెలుగు మహిలా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎంపిటిసి గొంప తులసి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొట్టాడ రమణమూర్తి, జనపరెడ్డి ఈశ్వరరావు దర్శించుకున్నారు.

తల్లిదండ్రులు కోరిన చోటే వైద్యం

ఇంద్రజ వైద్య ఖర్చులకు సిఎంఆర్‌ఎఫ్ కింద లక్ష చెక్కు అందజేత

ఇంద్రజ తల్లికి చెక్కు అందజేస్తున్న శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ బి లఠ్కర్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన వింత తల వ్యాధితో బాధపడుతున్న చిన్నారి మీసాల ఇంద్రజకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద లక్ష రూపాయలు చెక్కును ఇంద్రజ తల్లి కృష్ణవేణికి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లఠ్కర్ శనివారం తన ఛాంబర్‌లో అందజేశారు. అవసరమైన పూర్తి వైద్యాన్ని ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందని తల్లి దండ్రులు కోరిన చోటే ఉన్నతమైన వైద్యం ఉచితంగా అందిస్తామని ఇంద్రజ తల్లి కృష్ణవేణికి కలెక్టర్ హామీ ఇచ్చారు. చిన్నారి ఇంద్రజ వైద్యం పట్ల వైద్యుల అభిప్రాయాలను ఆమె తల్లి కృష్ణవేణికి తెలిపారు. ఈ నెల 23న సిఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో చిన్నారికి అవసరమైన వైద్యాన్ని అందించాలని కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఇంద్రజకు వైద్య పరీక్షలు, కుటుంబ ఖర్చులకు పర్యవేక్షణ కోసం జెమ్స్ ఆసుపత్రిలో ఉంచామని తెలిపారు. చిన్నారికి మరింత మెరుగైన వైద్యం అందించడంతో పాటు శస్త్ర చికిత్స కూడా చేయాల్సి ఉందని వైద్యులు సూచించినట్లు కలెక్టర్ చెప్పారు. దీని కోసం వైద్యులను పిలిపించామని, వారి అభిప్రాయం కూడా తెలుసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు కోరిక మేరకు శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై పట్టణాలలో ఎక్కడైనా ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం చేయిస్తామని చెప్పారు. అంతవరకు ఇతర ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. లక్ష అందించినట్లు ఆయన తెలిపారు. ఏ ఇతర సహాయం కావాలన్న ప్రభుత్వం తరపున అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇంద్రజ కుటుంబానికి అన్ని విధాలుగా సహకారం చేసిన వావిలవలసకు చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ, చిన్న శిర్లాంకు చెందిన మజ్జి శ్రీనివాసరావులను అభినందించారు. కలెక్టర్‌తో పాటు న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణచైతన్య, జెమ్స్ ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.ప్రకాషరావు, మీసాల కృష్ణవేణి ఉన్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

గరివిడి.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగార్జున

ప్రజాశక్తి - గరివిడి

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం పరిహాసమైందని చీపురుపల్లి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అని హక్కులు కల్పిస్తే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కనీసం భావ ప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, వెన్నె సన్నాసి నాయుడు, సారేపాక సురేష్ బాబు, మండల అప్పలనాయుడు, గడే సన్యాసప్పలనాయుడు, మీసాల కాశి, హారతి సాహూ, మీసాల శ్రీధర్, పిన్నింటి సన్నాసి నాయుడు, తోట శ్రీను, సబ్బి సోనియా, నాగులపల్లి నారాయణరావు, మండల చైతన్య, గంట్యాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

నెల్లిమర్ల: అంబేద్కర్ రాజ్యాంగం పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని టిడిపి నియోజకర్గ ఇంఛార్జి పతివాడ నారాయణ స్వామి నాయుడు పిలుపునిచ్చారు. శనివారం 72వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా టిడిపి నియోజకవర్గం స్థాయిలో రామతీర్థం కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా పతివాడ నారాయణ స్వామి నాయుడు మాట్లాడుతూ వైసిపి అంబేద్కర్ రాజ్యాంగాన్ని విస్మరించి జగన్ రెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజా స్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. దళితులు, బిసిలు, ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కె.ఆనంద్, మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్‌రావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు పతివాడ తమ్ము నాయుడు, పతివాడ అప్పల నారాయణ, టిడిపి కౌన్సిలర్లు నరవ రామ లక్ష్మి, కె. కళావతి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట : రాష్ట్ర ప్రభుత్వానికి అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన స్థానిక బాలాజీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. టిడిపి నగర అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఈ సందర్భంగా లక్ష్మీవరప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన నుంచి అరాచకాలు దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ఈనేపథ్యంలో వైసిపికి మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో కర్రోతు వెంకట నర్సింగరావు, కంది మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-వేపాడ

జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ 21లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని బక్కునాయుడుపేట, వల్లంపూడి వద్దనున్న జగనన్న లేఔట్లను పరిశీలించారు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన పరిస్థితులను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, సచివాలయ కార్యదర్శి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు త్వరతగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం గృహ నిర్మాణ దినోత్సవం ప్రకటించిన నేపథ్యంలో శనివారం మండలంలోని కుమిలిలో జగనన్న లే అవుట్‌లను పరిశీలించారు. కుమిలిలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారని, ఎంత మంది నిర్మాణం చేస్తున్నారో అక్కడ ఉప సర్పంచి గుజ్జు సురేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే చాలా మంది నిర్మాణాలు పూర్తి చేసారని, మిగతా వారు కూడా నిర్మాణాలు ప్రారంబించి పూర్తి చేస్తారని తెలిపారు. ఆయనతో పాటు ఎంపిపి మహంతి కళ్యాణి, తహశీల్దార్ భాస్కరావు, నాయకులు మహంతి శ్రీనువాసరావు అన్ని శాఖల అధికారులు హజరయ్యారు.

నెల్లిమర్ల : ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఇ జి. మురళీ మోహన్ అన్నారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా జరజాపుపేటలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వం గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టిందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే దశల వారీగా లబ్దిదార్ల బ్యాంకు ఖాతాలో నేరుగా బిల్లు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు మద్దిల వాసు, పాండ్రంకి సత్య నారాయణ, నల్లి శ్రీను, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డి పట్టా భూములు మాయం

చర్యలు తీసుకోవాలని వ్యకాస డిమాండ్

ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో కొండకెంగువ పంచాయతీలో తొత్తరకొండ సమీపంలో సర్వే నంబర్ 128-1,3లో 8 ఎకరాల డి పట్టా భూమిని జిరాయితీగా మార్చి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.శంకరరావు, బలస శ్రీను, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు అధికారులను డిమాండ్ చేశారు. తొత్తరకొండ సమీపంలో ఆక్రమించి విక్రయించిన భూములను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు, గిరిజనులకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని పెత్తందారులు, ఎస్ఆర్‌ఐలు ఆక్రమించుకోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో ఆక్రమించుకున్న భూములను పెత్తందారులు తమ బంధువుల పేర్లతో మార్చుకొని, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్, ఆర్‌డిఒ స్పందించి, కొండకెంగువ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని పూర్తిగా సర్వే చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. భూ అక్రమాలపై ఈ నెల 28న బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాపు బలరాం, ఆదినారాయణ దళితులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కె.రవిబాబు

చైర్మన్ రవిబాబుకు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నాయకుడు జగన్

ప్రజాశక్తి-వేపాడ

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పిల్లల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు ఆదేశించారు. శనివారం మండలంలోని కెజిపూడిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది, పిల్లల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. 350 మంది ఉండేందుకు అనుకూలమైన పాఠశాలలో 165 మంది పిల్లలే ఉండటంతో లోపాలపై అధ్యయనం చేయాలన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకిత భావంతో పని చేయాలని సూచించారు.

సాగుభూమికి పట్టాల కోసం విజ్ఞప్తి

ఈ సందర్భంగా గ్రామంలో 250 కుటుంబాలు సాగుచేస్తున్న 500 ఎకరాలకు సంబంధించి పట్టాలివ్వాలని సిపిఎం నాయకులు చల్లా జగన్.. చైర్మన్‌ను కోరారు. శృంగవరపుకోటలో మినీ ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, వేపాడ, శృంగవరపుకోట, గంట్యాడ, మెంటాడ, కొత్తవలస, బొండపల్లి మండలాల పరిధిలో ఉన్న గిరిజనులను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. మధ్యలో ఆగిపోయిన మారిక రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, ఎంపిటిసి డి.ముత్యాలమ్మ, వైసిపి నాయకులు ఎం.సత్యనారాయణ, తహశీల్దార్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు ధాన్యం సేకరిస్తే

పక్కదారి పట్టే అవకాశం

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిరసన గళం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- మెంటాడ

మండల సర్వసభ్య సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు నిరసన గళం వినిపించారు. శనివారం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ త్రివిక్రమరావు బడ్జెట్ అంచనా చదివి వినిపించారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగనుందని ఎఒ మల్లికార్జునరావు చెప్పబోతుంటే సభ్యులు అడ్డుతగిలారు. వాలంటీర్లు ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరిస్తే ప్రభుత్వం ఉద్దేశం పక్కదారి పట్టే అవకాశం ఉందని వైసిపి మద్దతుదారు పిట్టాడ సర్పంచ్ కె.పైడపునాయుడు అన్నారు. గతంలో మాదిరిగా రైతులను మిల్లర్లు ధాన్యం నాణ్యత పేరుతో ఇబ్బంది పెడితే ప్రతిఘటన తప్పదని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు అప్పలనాయుడు హెచ్చరించారు. ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు కలుగజేసుకొని మనమే తిరగబడితే ఎలా? అని, మిల్లర్లకు సహకరించాలని కోరారు. కుంటినవలసలో రైతులకు గత ఏడాది ధాన్యం డబ్బులు ఇంకా అందలేదని సర్పంచ్ రమేష్ నాయుడు సమావేశంలో లేవనెత్తారు. పెదచామలాపల్లిలో రేషన్‌కార్డుల కన్నా ఇళ్లు అధికంగా ఉన్నాయని,కొత్తగా స్థలాలు, జగనన్న ఇళ్లు ఎలా మంజూరు చేస్తున్నారని పెదమేడపల్లి టిడిపి ఎంపిటిసి రెడ్డి ఎర్నాయుడు నిలదీశారు. పెదమేడపల్లిలో రెండు అంగన్వాడీ భవనాలు చెరువు గర్భంలో నిర్మిస్తున్నారని, దీనివల్ల ప్రమాదం పొంచిఉందని చెప్పారు. సిడిపిఒ కూడా ఆ ప్రాంతం కేంద్రాలకు అనుకూలం కాదని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తహశీల్దార్ ఆదిబాబును ప్రశ్నించారు. అది చెరువుకాదని, రికార్డుల్లో గ్రామకంఠం అని ఉండడంతో స్థలం మంజూరు చేశామని ఆయన బదులిచ్చారు. విద్యుత్తు, ఉపాధి హామీలో అనేక సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లెంక సన్యాసి అప్పలనాయుడు పాల్గొన్నారు.

లెండిలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ అండ్ కమ్యూనికేషన్ అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఐఐఐటి, కోటా కాలిఫోర్నియా యూనివర్సిటీ యుఎస్ఎ అండ్ లెండి ఇంజినీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో కో ఆక్యూవేట్ నుండి జగన్ మోహన్ జామీ పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు టెక్నాలజీలో ప్రస్తుతం వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకోవడానికి ఉపయోగ పడతాయన్నారు. నిట్ సిల్చార్‌కు చెందిన ఆచార్యులు బాదల్ సోని, మాట్లాడుతూ వివిధ ప్రదేశాల నుండి వచ్చిన పలువురు డెలిగేట్లు తమ పరిశోధనాంశాలను ఈ సదస్సులో చర్చించడం తద్వారా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ కమ్యూనికేషన్ పై పలు కొత్త విషయాలను తెలుసు కోవడమైందన్నారు. అందుకు అవకాశాన్ని కల్పించిన లెండి కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామారెడ్డి, చైర్మన్ పి. మధుసూదన రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె. శివరామ కృష్ణ, డిపార్ట్‌మెంట్ హెడ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో ప్రతిభాన్వేషణ పోటీలు

మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

ప్రజాశక్తి- డెంకాడ

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'ప్రతిభా అన్వేషణ పోటీలు కౌశల్ 2022'ను నిర్వహించారు. ఇందులో క్విజ్ విభాగంలో జెడ్‌పిహెచ్ఎస్ జిన్నాం మొదటి బహుమతిగా రూ.7500, జెడ్‌పిహెచ్ఎస్ పెదతాడివాడ ద్వితీయ బహుమతిగా రూ. 6వేలు, ఏపిఆర్ఎస్ బొబ్బిలి తృతీయ బహుమతిగా రూ. 4,500 సాధించాయి. పోస్టర్ జనరల్ విభాగంలో ఎం.జాహ్నవి (జిన్నాం), మొదటి బహుమతిగా రూ. 3వేలు, షేక్ శర్మిష (విజయనగరం), ద్వితీయ బహుమతిగా రూ.2వేలు, టి. సాహితి(కోనాడ) మూడో బహుమతిగా రూ. 1,000 గెలుపొందారు. పోస్టర్ అజాదిక అమృత్ మహోత్సవమ్ విభాగంలో యు. లాస్య మాధురి, (నెలిమర్ల), రూ. 3వేలు, ఎస్. పావని (వంగర), రూ. 2వేలు, టి. గ్రీష్మ (దేవాడ) రూ. 1000ను వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయా స్థానాల్లో గెలిపొందారు. పై విభాగాలలో మొదటి రెండు స్థానాలలో నిలిచిన వారు రాష్ట్ర